క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన హర్ష

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామానికి చెందిన వాకాడ హర్ష అదృశ్యమైనట్లు హర్ష తండ్రి పైడిపునాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. హర్ష తండ్రి పైడిపునాయుడు విలేకరులతో మాట్లాడుతూ హర్ష బొబ్బిలిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఈనెల 18వ తేదీన కొండరేజేరు గ్రామం వచ్చి, తిరిగి 23వ తేదీన ఇంటినుంచి కాలేజీకి వెళ్తానని చెప్పి బయల్దేరాడు. కాలేజీకి వెళ్లాక హర్ష తల్లిదండ్రులకు ఫోన్ చేయపోవడంతో అనుమానం వచ్చి కాలేజీకి ఫోన్ చేయగా మీ అబ్బాయి కాలేజీకి రాలేదని కళాశాల యాజమాన్యం తెలిపారు. హర్ష స్నేహితులను ఆరా తీయగా, వారికి కూడా తెలియదని చెప్పారని తండ్రి పైడిపునాయుడు వాపోయారు. హర్ష అదశ్యంపై మక్కువ పోలీస్స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

చిన్నారికి ఆశీస్సులు



చిన్నారిని ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

సాలూరు: పట్టణంలోని దాసరివీధి సీతారామ ధర్మశాలలో నాగిరెడ్డి సింహాచలం మనుమరాలి రజస్వల కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర , బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

ఏనుగులు తరలించేదెప్పుడో?



సుంకిలో ఏనుగులు ధ్వంసం చేసిన అరటి పంట

గరుగుబిల్లి: మండలంలో సంచరిస్తున్న ఏనుగులు ఎప్పుడు తరలిస్తారోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుంకి, సంతోషపురం, మరుపెంట తదితర గ్రామాల్లో ఓ ఏనుగుల గుంపు సంచరిస్తూ ఆయా ప్రాంతాల్లోని అరటి, వరి, పామాయిల్ పంటలను ధ్వంసం చేశాయి. దీంతో బాధిత రైతులు నష్టపోయాయి. సుంకిలో ఏనుగుల గుంపు తిష్ట వేసినప్పుడు గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జి.సింహాచలం, జి. రమేష్‌లకు చెందిన వరికుప్పలు, విద్యుత్ మోటార్ పంపుసెట్‌ను నాశనం చేశాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి కూడా వరి, అరటి, పామాయిల్, మోటార్ పంపుసెట్‌ను ధ్వంసం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఏనుగుల సంచారంతో ప్రజలు పొలాలకు వెళ్లేందుకు కూడా భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చొరవ తీసుకుని, ఏనుగులు తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముమ్మరంగా సోషల్ ఆడిట్

భామిని: మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ ముమ్మరంగా చేపడుతున్నారు. నేరడి – బి గ్రామంలో డీఆర్పీ నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా గోశాల నిర్మాణాలు, వేతనదారులకు అందుతున్న వేతనాలపై ఆరా తీశారు.

హెల్మెట్ తప్పనిసరి

పాలకొండ రూరల్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ – విశాఖ, వీరఘట్టం, సీతంపేట రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

వితరణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలు పురస్కరించుకుని, కురుపాం మండలంలోని ఊసకొండ గ్రామంలో వంద మంది వృద్ధులు, వితంతువులకు యస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చీరలు వితరణ చేశారు. సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన బ్యాంకు ఉద్యోగి నగేష్.. ఆయన స్నేహితుల సహకారంతో సమకూర్చిన చీరలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అడ్డమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హామీ.. అంతా గ్యాసేనా..!



ఇంటింటికీ వస్తున్న గ్యాస్‌వ్యాన్

సీతానగరం:

రాష్ట్రంలో మహిళలకు ఉచిత వంట గ్యాస్ పథకం హామీ ఆదిలోనే హంసపాదుగా మారింది. మహిళలకు కానుకగా దీపావళి పండగ నుంచి ఉచితంగా గ్యాస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. నిజానికి ఇప్పటికే రెండు సిలిండర్లు ఇవ్వాలి కానీ..నవంబరు నెలాఖరువరకూ మొదటి సిలిండరకు డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారులకే గ్యాస్ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమచేసి చేతులు దులుపుకున్నారు. గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నా నేటికి సబ్సిడీ రాలేదు. ఇప్పటికి 45 రోజులు కావస్తున్నా అతీగతీ లేదు. ఎప్పుడు డబ్బులు వేస్తారో సెల్‌ఫోన్‌లో మెసేజ్ వస్తుందేమోనని చూసుకుంటున్నా డబ్బులు జమకాక పోవడం వల్ల నిరాశగా కూటమి పాలకులపై మహిళలు విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఉంది.



మండలంలో 8280 గ్యాస్ కనెక్షన్లు

సీతానగరం మండలంలో మొత్తం 8,280 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో ఉజ్వల, పీఏయూవై, దీపం, జనరల్, భారత్ గ్యాస్ కనెక్షన్లున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు బొబ్బిలి నుంచి వినియోగదారులకు నిరంతరం ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని టీడీపీ నాయకత్వంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ప్రకటించిన వారం రోజులు కొంత మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. మిగతా వారికి ఇంతవరకూ డబ్బులు ఖాతాల్లో వేయడం లేదు.

48 గంటల్లో అమలు కాని సబ్సిడీ

మండలంలోని వంటగ్యాస్ వినియోగదారులకు గ్యాస్ విడిపించిన 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే మండలంలో ఇంతవరకూ గ్యాస్ విడిపించిన వారిలో 40 శాతం మందికి డబ్బులు పడలేదని, సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ పాస్‌బుక్ చేతబట్టుకుని తిరగాల్సి వస్తోందని మండిపడుతున్నారు. దీనికి నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు కూడా ఈ విషయంలో ఏమీ చెప్పలేక పోతున్నారు. పాలకులు మాత్రం అందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చినట్లు ప్రచారం చేస్తుకుంటున్నారు. గ్యాస్ డెలివరీ చేసిన 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమవుతాయని చెప్పారు. కానీ నవంబర్ లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 23 రోజులు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు.

సబ్సిడీ కోసం ఎవరిని అడగాలి

ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి సమస్యలుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీ డబ్బులు ఎందుకు పడలేదని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే పౌరసరఫరాల కార్యాలయంలో అడగమని అంటున్నారు. అక్కడికి వెళితే బ్యాంక్ ఈకేవైసీ చేయించాలంటున్నారని, ఈకేవైసీ చేయించామని చెబితే గ్యాస్ ఆఫీసుకు వెళ్లి చెప్పమని అంటున్నారు. దీంతో ఉచిత గ్యాస్ పథకం కూటమి ప్రభుత్వ మాయగా ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడడంతో ఇలా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి.



సబ్సిడీ పడలేదని గ్యాస్ బుక్‌లతో పొదుపు సంఘం సభ్యులు

బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు



ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తుందని చెబితే నమ్మి గ్యాస్ బుక్ చేశాను. నెలలు గడుస్తున్నా సబ్సిడీ డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలో వేయడం లేదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగితే మాకు తెలియదంటున్నారు. మీ అకౌంట్లోనే డబ్బులు పడతాయని చెబుతున్నారు. మాకున్న రెండు బ్యాంక్ ఖాతాలను పలుమార్లు పరిశీలించినా డబ్బులు పడలేదు. ఇచ్చిన హామీ మేరకు సబ్సిడీ డబ్బులు విడుదల చేయాలి. – సీహెచ్ సత్యవతి, లక్ష్మీపురం

ఇంకా డబ్బులు పడలేదు



మాగ్రామానికి వచ్చిన గ్యాస్ వ్యాన్ వద్ద డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్నాను. గ్యాస్ తీసుకున్న మరుసటి రోజు గ్యాస్ డబ్బులు పడతాయని, బ్యాంక్‌లో తీసుకోండని చెప్పారు. కానీ ఇంతవరకు పడలేదు. ఎవరిని అడగాలో తెలియక బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నాను. ఎవరిని అడిగినా నాలుగు రోజులు ఆగండి అంటున్నారు. లేకపోతే అధికారులను అడగండి అని చెబుతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలి. – బక్కు సావిత్రమ్మ, బక్కుపేట

మామిడికి ముసురు దెబ్బ



మామిడిచెట్లకు అరకొరగా పూతలు

● రైతుల్లో ఆందోళన

బలిజిపేట: మామిడి రైతులను ముసురు వెంటాడుతోంది. ముసురు దెబ్బ రైతును ఆందోళనకు గురిచేస్తోంది. పూత రావడానికి రెండు నెలల ముందు మామిడి తోటల్లో తేమ ఉండకూడదు. కానీ డిసెంబర్ నెలలో పెట్టిన తుఫాన్ ప్రభావంతో ముసురుతో పూత, పిందె, కాయలపై ప్రతికూలత ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పూతజాడ లేదని దిగులుతో ఉన్న రైతులను ముసురు ప్రభావం మరింత దిగులుకు గురిచేస్తోంది. రైతులు ఎక్కువగా బంగినపల్లి, కలెక్టర్, చిన్న రసాలు, పెద్ద రసాలు, పంచదార కలశలు వంటి రకాలను ఎక్కువగా పండిస్తారు.

దిగుబడిపై ఆందోళన

ఏటా వేసవి సీజన్‌లో మాత్రమే మామిడి అందుబాటులో ఉంటుంది. మూడు నెలల పాటు పంట ఉంటుంది. కానీ ఈసారి కురుస్తున్న వర్షాలు మామిడి రైతులను కలవరపెడుతున్నాయి. మంచు ఎక్కువగా ఉండడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. పూతజాడ లేకపోవడం, అరకొరగా కనిపించినా అది ఎదుగుదలకు వస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏప్రిల్, మే నెల్లో వచ్చే ఈదురుగాలులు, వర్షాల భయం రైతులను కలవరపెడుతున్నాయి. అప్పుడు వడగళ్ల వానలతో కాయకుళ్లిపోయి నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి. చెట్టుమీద ఉండగానే మామిడి కాయ పురుగుపడుతోంది. పండు కాకముందే అవి పనికిరాకుండా పోతున్నాయి. దీంతో దిగుబడి బాగా తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత సంవత్సరం లాభాలు ఈ సంవత్సరం వస్తాయా:

గత సంవత్సరం ఒక హెక్టారుకు(2.5ఎకరాలు) 10టన్నుల నుంచి 15టన్నుల వరకు దిగుబడి వచ్చింది. స్థానిక మార్కెట్, ఎగుమతులకు ఉన్న డిమాండ్ తదితర అంశాల ప్రాతిపదికపై మామిడి ధరలు ఉంటాయి. ఈ నేపథ్యంలో గతేడాది మామిడి రైతులు మంచి లాభాల తీపి రుచులు చూశారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొని ఉన్నందున మామిడి పూత జాడ కరువవడంతో దిగుబడి పట్ల ఆందోళన చెందుతున్నారు. పెట్టిన ఖర్చు భారంగా మారనుందని రైతులు చెబుతున్నారు.

పరిస్థితులు అనుకూలించాలి

రానున్న మామిడి పంటకు పరిస్థితులు అనుకూలించాలి. ఇప్పుడు ఈ పరిస్థితులు, ఆ తరువాత ఈదురుగాలులు, వడదెబ్బలతో పంటదిగుబడి నష్టపోయే అవకాశాలున్నాయి. అంతా అనుకూలిస్తే బాగుంటుందని ఆశిస్తున్నాం. –సత్యం, రైతు, నారాయణపురం

ఇలా చేయాలి



బూజు తెగులు, ఆకులపై మచ్చలు వంటి తెగుళ్ల సోకే అవకాశాలుంటాయి. దీన్ని నివారించడానికి బావిస్టన్ 2గ్రాములు ఒక లీటరు నీటికి, హెక్సాకొనొజోల్ 1.5ఎంఎల్ ఒక లీటరు నీటికి చొప్పున వేరువేరుగా ద్రావణాలు కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా చెట్టుకు బలం చేకూరేందుకు 13-0-45 రకం ఒక లీటరు 5గ్రాముల వంతున ద్రావణాన్ని తయారుచేసి ఒక చెట్టుకు 5లీటర్ల వంతున స్ప్రే చేయాలి.

–ప్రత్యూష, ఉద్యాన అధికారిణి, బలిజిపేట మండలం

కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోచ్ బి.కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన సాలూరు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ చిరు ఉద్యోగుల సమస్యలపై గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఈ ప్రభుత్వం విధానపరంగా ప్రకటన జారీ చేయలేదని వాపోయారు. దీనివల్ల ఈ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరికీ ఉద్యోగభద్రత కల్పించేలా ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించి పెరిగిన ధరలకు తగ్గట్టు కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల వేతనాలు కూడా ఎరియర్స్‌తో కలిసి విడుదల చేసేలా నిర్ణయం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు సూచనలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోని అన్ని డిపార్ట్‌మెంట్‌లలో సమాన పనికి సమాన వేతనం అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌వై నాయుడు, రాముడు, శంకర్రావు, శ్రీరామ్, ఆనంద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి రోడ్డు నిర్మించాలి



కాశీపేట స్వర్గధామానికి వేస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ చంద్రమౌళి

సీతానగరం: ఉపాధి హామీ పథకం నిధులతో మండలానికి మంజూరు చేసిన సీసీ రోడ్లు, కాలువ నిర్మాణం పనులు నాణ్యతాప్రమాణాలకు లోబడి ఉండాలని పీఆర్ ఏఈ జి.చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మండలంలోని కాశీపేట గ్రామ శివారులో ఆదివారం రూ.4 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్వర్గధామానికి సీసీరోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం సామాజిక పరమైన అభివృద్ధి పనులు మంజూరు చేసిందన్నారు. ఆయా పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే నిడగల్లు–ముత్యాలదొరవలస, బగ్గందొరవలస–గెడ్డలుప్పి మీదుగా కొత్తవలస, సుమిత్రాపురం–వల్లరిగుడబ రోడ్డు పనులకు భూమి పూజచేసినా ముడిసరుకు కొరత కారణంగా పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి మంజూరు చేసిన పనులన్నీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాశీపేట సర్పంచ్ టి. చంద్రశేఖర్, ఉపసర్పంచ్, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

కొమరాడ: రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి మండంగి సంతోష్ ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్ అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్‌లో సదరు విద్యార్థి రెండో స్థానంలో నిలిచారని, దీంతో కౌశల్–2024 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. అమరావతిలో 29, 30వ తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మహిళామండలి నాయకురాలు రాధ

సాలూరు: ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలపై అనేక అఘాయిత్యాలు, అకృత్యాలు జరుగుతున్న నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారిని సంరక్షించుకోవాలని మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఐదవ వార్డులో మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం పాలు తాగే పసిపిల్లల నుంచి ముసలి అవ్వలను కూడా కొందరు కామాంధులు విడిచిపెట్టకుండా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. బాలికలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లినప్పుడు ఎవరైనా వారి పట్ల తప్పుగా ప్రవర్తించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని పిల్లలకు చెప్పాలన్నారు. బాలికల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండమని చెప్పాలని అన్నారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

కేటుగాళ్ల మాయలో పడొద్దు

● సామాన్యులపై సైబర్ నేరగాళ్ల వల



పార్వతీపురంటౌన్: సాంకేతికత ఎంత పెరుగుతోందో.. మోసాలూ అంతే స్థాయిలో ఎక్కువవుతున్నాయి. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో బ్యాంకింగ్ సేవలు సులువయ్యాయి. దీంతో చిటికెలో నగదు లావాదేవీలు సాగి పోతున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్స్ సంపూర్ణ అవగాహన ఉన్నవారు అతి కొద్ది మందైతే.. పెద్ద పరిజ్ఞానం లేని వారు కోకొల్లలు. ఇలాంటి వారినే సైబర్ నేరస్తులు లక్ష్యంగా చేసుకుని బురిడీ కొట్టిస్తూ నగదును కాజేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ తరహాలో మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఖాతాదారులకు పోలీసులు, అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. మోసగాళ్లు అంతే స్థాయిలో రెచ్చిపోతూ కొత్త కొత్త తరహాలో నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాలు..ఈ పేరు వింటేనే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ఏ మూల నుంచి నేరగాళ్లు ఏ రకంగా దాడి చేసి నగదును స్వాహా చేస్తారోననే ఆందోళన కలవరానికి గురిచేస్తోంది. నకిలీ క్యూఆర్ కోడ్లు..నగదు పంపకుండానే స్క్రీన్ షాట్లు చూపడం ..ఏపీకేలను పంపి ఫోన్లను హ్యాక్ చేస్తుండడం ..బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీలు కోరడం.. డిజిటల్ అరెస్టులు..ఇలా చెప్పుకుంటూ పోతే సైబర్ మోసాలు కోకొల్లలు, ఎంతో మంది వీరి బారినపడి ఆర్థికంగా చితికిపోతున్నారు. అధికారులు ఎంత మొత్తుకుంటున్నా, బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

ఏమరుపాటుగా ఉంటే అంతే..

బ్యాంకింగ్ యాప్‌ల తరహాలో ఉండే నకిలీలను కేటుగాళ్లు సృష్టిస్తున్నారు. ఈ రకమైన ఏపీకే ఫైళ్లను వాట్సాప్‌లో పంపి, వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవాలని పురమాయిస్తుంటారు. ఒకవేళ వాటిని డౌన్లోడ్ చేసుకుంటే ఫోన్ నియంత్రణ మొత్తం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. తద్వారా ఓటీపీలను సేకరించి బ్యాంక్ ఖాతాల్లో నగదును ఊడ్చేస్తున్నారు. ఏ బ్యాంకూ ఏపీకే ఫైళ్లను డౌన్లోడ్ చేసుకోవాలని కోరదనే అంశాన్ని అనేక మంది విస్మరిస్తూ, నట్టేట మునిగిపోతున్నారు.

ఏపీకేలతో జాగ్రత్త



చాలా చోట్ల వాట్సాప్‌లో ఏపీకే ఫైళ్లొస్తున్నాయి. ఇలాంటి వాటిని బ్యాంకులు పంపవు. బ్యాంకుల ద్వారా వ్యక్తిగత సమాచారం అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దు. తక్షణమే బ్యాంకు వారిని సంప్రదించాలి. సైబర నేరగాళ్ల ఉచ్చులో పడితే ఫోన్ హ్యాక్ అవడంతో పాటు నగదును కోల్పోయే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించడం ద్వారా ఇలాంటి వాటి నుంచి దూరంగా ఉండొచ్చు.

– మురళీధర్, పార్వతీపురం పట్టణ సీఐ

అసలు స్పందించొద్దు



బ్యాంకుకు సంబంధించిన యాప్‌లను మెసేజ్‌ల ద్వారా పంపరనే విషయాన్ని తెలుసుకోవాలి. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం, ఓటీపీలను చెప్పాలని ఎవరైనా కోరితే అది మోసమనే విషయాన్ని ఖాతాదారులు భావించాలి. ఏమైనా అనుమానం వస్తే నేరుగా బ్యాంకులను సంప్రదించాలి.

– సత్యారావు, ఎస్‌బీఐ బజార్, బ్యాంక్ మేనేజర్, పార్వతీపురం

నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు స్పందన

వీరఘట్టం: యూటీఎఫ్ వీరఘట్టం మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 226 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు తెలిపారు. ఈ గ్రాండ్ టెస్ట్‌లో కోటబొమ్మాళికి చెందిన విద్యార్థి వై.కీర్తిక ప్రథమ స్థానం, వీరఘట్టం గాయత్రీ స్కూల్ విద్యార్థి ఆర్.కేతన్ ద్వితీయ స్థానం, కోటబొమ్మాళికి చెందిన వి.వినీత్, పొందూరు గాయత్రీ స్కూల్‌కు చెందిన జి.కేశవ, జి.సిగడాం మండలానికి చెందిన ఎస్.నివేదిత తృతీయ స్థానాలు సాధించారు. వీరికి యూటీఎఫ్ నాయకులు బహుమతులు అందజేశారు. వీరిలో మొదటి 30 స్థానాల్లో నిలిచిన 33 మంది విద్యార్థులకు జనవరి 12న వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నవోదయ – 2025 మోడల్ గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులకు గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ లోకేష్ ఉచిత భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కురమాన గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, మహేష్, గౌరునాయుడు, స్వామిబాబు, సూర్యప్రకాష్, అన్నాజీ, వాసుదేవరావు, ముకుందరావు, రాంబాబు, చంద్రమోహన్, రాజేష్, గోవిందరావు, సింహాచలం, వెంకటరమణ, గణేష్, రవీంద్ర, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు